www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:48, శుక్రవారం, 08.12.2023






www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:48, శుక్రవారం, 08.12.2023



‘పాలకులం కాదు.. సేవకులం’ అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థి , నిరుద్యోగ, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో ఇక అంతటా సమానాభివృద్ధి జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడు రావాలనుకున్నా... ‘జ్యోతిరావ్‌పూలే ప్రజాభవన్’లోకి రావొచ్చు అన్నారు. ప్రజల ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకోవచ్చు అని పేర్కొన్నారు. జ్యోతీరావు పూలే ప్రజా భవన్ లో నేడు ప్రజాదర్బర్ నిర్వహిస్తామని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడడంతో స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. గురువారం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఆషామాషీగా ఏర్పడ్డ రాష్ట్రం కాదని, పోరాటాలతో, త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ రాష్ట్రమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలోని 4 కోట్ల మంది జనాలకు స్వేచ్ఛ ఇవ్వాలని సామాజిక న్యాయం చేయాలని ఆసిఫాబాద్ నుంచి మొదలుపెడితే అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి మొదలుపెడితే కొడంగల్ వరకు సమానమైన అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో శ్రీమతి సోనియా గాంధీ ఉక్కు సంకల్పం, కాంగ్రెస్ పార్టీ సమిధగా మారి..ఈ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. దశాబ్దకాలంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం హత్యకు గురయ్యి, మానవ హక్కులకు భంగం కలిగి ఈ ప్రాంతంలో ప్రజలు చెప్పకోవడానికి ప్రభుత్వం నుంచి వినేవాళ్లు లేక ప్రజలు మౌనంగా భరించారన్నారు. గత ప్రభుత్వం ప్రజల బాధలను పట్టించుకోలేదన్నారు. దశాబ్ద కాలపు నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని పేర్కొన్నారు. "ఇందిరమ్మ రాజ్యంలో సోనియామ్మ అండతో ప్రజలకు మేలైన సంక్షేమంతో పాటు అభివృద్ధిని చూసి చూపిస్తాం. పాలకులం కాదు సేవకులం అనే విధంగా పని చేస్తాను. కాంగ్రెస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటాను" అని రేవంత్ రెడ్డి చెప్పారు.



# తెలంగాణలో.. ఇందిరమ్మ రాజ్యం

## పాలకులం కాదు.. ప్రజా సేవకులం

- రాష్ట్రంలో పదేండ్లు ప్రజాస్వామ్యం ఖూనీ
- విద్యార్థి, నిరుద్యోగులకు న్యాయం చేస్తాం
- అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తాం
- ప్రగతి భవన్ కాదు.. జ్యోతీబా పూలే ప్రజాభవన్
- ప్రమాణ స్వీకారోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి
- ఆరు గ్యారంటీలపై ముఖ్యమంత్రి తొలి సంతకం
- దివ్యాంగురాలు రజినికి ఉద్యోగ నియామక పత్రం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అమరుల ఆశయ సాధనకు ఇందిరమ్మ రాజ్యం ప్రతినబూనిందన్నారు. ఇప్పటికే ప్రగతిభవన్ ముందు ఉన్న ఇనుప కంచెలను బద్దలు కొట్టించామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చుదిద్దుతామని స్పష్టం చేశారు. మీ బిడ్డగా.. మీ సోదరుడిగా మీ బాధ్యతలను తాను నిర్వహిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. “ఇక్కడ ప్రమాణ స్వీకారం మొదలైనపుడే అక్కడ ప్రగతి భవన్ గడీ ఇనుప కంచెలు బద్దలు కొట్టాం. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాట ఇస్తున్నా... ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములు. ఇవాళ ప్రగతి భవన్ చుట్టూ కంచెలు బద్దలు కొట్టాం. రేపు ఉదయం 10 గంటలకు జ్యోతీరావు పూలే ప్రజా భవన్ లో ప్రజా దర్బారు నిర్వహిస్తాం. మేం పాలకులం కాదు.. మేం సేవకులం... మీరు ఇచ్చిన అవకాశాన్ని ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగిస్తాం కార్యకర్తల కష్టాన్ని, శ్రమను గుర్తు పెట్టుకుంటా.. గుండెల్లో పెట్టుకుంటా” అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో శాంతిభద్రతలు కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణను అభివృద్ధి చేస్తా అని ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.

**ఆరు గ్యారంటీలపై తొలి సంతకం..రజినీకి ఉద్యోగంపై రెండో సంతకం**

తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రేవంత్‌రెడ్డి రెండు ఫైళ్లపై సంతకాలు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీల ఫైలుపైనే ఆయన తొలి సంతకం చేశారు. ఆ తర్వాత గతంలో ఇచ్చిన మాట మేరకు దివ్యాంగురాలు రజినీకి ఉద్యోగ నియామక ఉత్తర్వులపై రెండో సంతకం చేశారు. నాంపల్లి నియోజకవర్గంలోని బోయిగూడ కమాన్ ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలైన రజినీ కష్టపడి పీజీ వరకు చదివింది. ఉన్నత చదువు పూర్తి చేసినా ఎవరూ ఉద్యోగం ఇవ్వలేదు. గతంలో గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని కలిసి ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి

..మిగతా 3లో

## ప్రమాణ స్వీకారం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తెలంగాణ మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రమాణం చేయించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం .. యువజన కాంగ్రెస్ నేతగా 2004- –2014 మధ్య నల్గొండ ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి గెలుపొందారు. వైఎస్, రోశయ్య, కిరణ్ కేబినెట్ లలో మంత్రిగా పని చేశారు. 2011లో తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2018లో నల్గొండ అసెంబ్లీ స్థానంలో ఓడిపోయారు. 2019లో నల్గొండ ఎంపీగా గెలుపొందారు. 2023లో మరోసారి నల్గొండ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కోమటి రెడ్డి దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సన్నిహితుడిగా ఉండే వారు. ఆయన అంటే వెంకట రెడ్డికి ఎనలేని అభిమానం కూడా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తొలిసారి మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. తొలిసారి ఐటీ శాఖ మంత్రిగా బాధ్యతలను పర్యవేక్షించారు. ఇక 2009లో రాజశేఖర్ రెడ్డి మరణం తరువాత ముఖ్యమంత్రులు మారారు.




విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
3
శుక్రవారం,
08.12.2023
హైదరాబాద్


# టీబీజీకేఎస్ గెలుపు సింగరేణికి అవసరం

- కార్మికుల కష్టం తెలంగాణలో వెలుగులు నింపుతోంది
- ధైర్యంగా పోరాటం చేయాలి
- ఎమ్మెల్సీ కవిత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సింగరేణి సంస్థ ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ సంఘం నాయకులు, ముఖ్య కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో బొగ్గు గని కార్మికులు ప్రధాన భూమిక పోషించారని, సింగరేణి కార్మికులకు ఉన్న పోరాట స్ఫూర్తి జాతీయ సంఘాలకు లేదని స్పష్టం చేశారు. గనుల్లో కార్మికులు చేస్తున్న కష్టం, చిందిస్తున్న చెమట తెలంగాణలో వెలుగులు నింపుతోందని, కాబట్టి ధైర్యంగా పోరాటం చేయాలని దిశానిర్దేశం చేశారు.అధికారం ఉన్నా లేకున్నా తెలంగాణ కోసం పోరాటం చేసి సాధించామని, ఈ సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేస్తామనడంలో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో ఒక్కొక్కరు ఒక్కో కేసీఆర్ లా పనిచేయాలని అన్నారు. మ్యానిఫెస్టో కమిటీని ఏర్పాటు చేస్తామని, అతిత్వరలో తమ సంఘం మ్యానిఫెస్టోను విడుదల చేస్తుందని ప్రకటించారు. ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ వంటి జాతీయ సంఘాలు సింగరేణి హక్కులను ఏనాడూ కాపాడలేదని, భవిష్యత్తులోనూ సంఘాలను సింగరేణి ఎదుగుదల కోసం ఏమీ చేయలేవని విమర్శించారు.తమకు పోరాటాలు కొత్తకాదని, కార్మికుల హక్కులను సాధించే వరకు విశ్రమించబోమని, కార్మికుల పక్షాన ప్రతి నిత్యం నిలబడి ఉంటామని పునరుద్ఘాటించారు. కార్మికులు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే కాకుండా ఆత్మగౌరవం ఇవ్వాలన్న ఆలోచనతో కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలియజేశారు. సింగరేణి పనితీరును మెరుగుపర్చడానికి, కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ చేసిన మంచిపనులను కార్మికుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేసీఆర్ చేసిన పనులను కార్మికులకు సరిగ్గా చెబితే టీబీజీకేఎస్ కు ఎదురుండదన్నారు.

## లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్**




**విశాలభారతి, హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను విడుదల చేసిందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, ఓటర్ల ఫొటోల మార్పుల కోసం ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు కేంద్రం ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2024 జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. 2024 జనవరి 8న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. 2024 జనవరి ఒకటో తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని వెల్లడించింది.

## అధైర్యపడవద్దు.. ధైర్యంగా ఉండండి

**కార్యకర్తలకు హరీశ్‌రావు భరోసా**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ కూడా అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. గురువారం సిద్దిపేటలో క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నంగునూరు, చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్, రూరల్, సిద్దిపేట మున్సిపాలిటీ, నారాయణరావుపేట, గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. 'మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలి సార్' అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దివ్యాంగులు, ఆటో రిక్షా కార్మికులు, తదితరులు హరీశ్‌రావును కలిసిన వారిలో ఉన్నారు. వారి వారి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన ఓట్లతో పాటు ఇతర పార్టీలకు వచ్చిన వివరాలను విన్నవించారు. వరుసగా సిద్దిపేట నుంచి ఏడవ సారి విజయం సాధించడం పట్ల పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు.

# తెలంగాణలో.. ఇందిరమ్మ రాజ్యం

**మొదటిపేజీ తరువాయి**

రాగానే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ విషయాన్ని గుర్తుపెట్టుకుని రజినీకి ప్రమాణస్వీకారానికి ఆహ్వానించిన రేవంత్ రెడ్డి.. ఆమెకు ఉద్యోగ నియామక పత్రాన్ని అందించారు.

**సీఎంగా ప్రమాణ స్వీకారం**

తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై ఆయనతో ప్రమాణం చేయించారు. కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన ముఖ్యనేతలు ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక తోపాటు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ ముఖ్యనేతలు, కార్యకర్తలు తరలివచ్చారు.

**బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి**

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి వెళ్లారు. సీఎం హోదాలో తొలిసారి సచివాలయానికి వెళ్లిన ఆయనకు సీఎస్ శాంతికుమారి ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అధికారులు, పోలీసులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత సచివాలయం ఆరో ఫ్లోర్లోని ఛాంబర్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మతాల వేద పండితులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆశీర్వదించారు.



## విద్యుత్ శాఖలో ఏం జరుగుతోంది?

- నిజాలు ఎందుకు దాస్తున్నారు?
- విద్యుత్ సంక్షోభానికి కుట్ర చేశారు
- భారీగా కుట్రకు తెరలేపారు
- కేబినెట్ సమావేశంలో సీఎం ఆగ్రహం
- నేడు మరోసారి రివ్యూ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం అయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన తొలి మంత్రివర్గ సమావేశం ఇదే. తెలంగాణ సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో నేడు కొత్తగా ప్రమాణం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా 11 మంది మంత్రులు, సీఎస్ శాంతి కుమారి, వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆరు గ్యారంటీల అమలుపై చర్చలు చేసినట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలపై భేటీలో చర్చించినట్లు తెలిసింది. హాట్ హాట్‌గా సాగిన తొలి క్యాబినెట్ సమావేశం జరిగింది. ముఖ్యంగా విద్యుత్ రంగంపై సీరియస్ గా రివ్యూ జరిగింది. విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యుత్ శాఖలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దాచి పెట్టడంపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం. విద్యుత్ సంక్షోభం తెచ్చేలా కుట్ర జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రేపటిలోగా పూర్తి వివరాలతో రావాలని ఆదేశించారు.

**రేపు ఉదయం విద్యుత్ శాఖపై సీఎం ప్రత్యేక సమీక్ష**

విద్యుత్ శాఖలో ఇప్పటివరకు రూ.85 వేల కోట్ల అప్పులు ఉన్నాయని విద్యుత్ అధికారులు సీఎంకు చెప్పారు. చివరికి ఆ సమావేశానికి సీఎండీ ప్రభాకర్ రావును కూడా తీసుకురావాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయన మూడు రోజుల క్రితమే రాజీనామా చేయగా.. ఆమోదించొద్దని ఆదేశించారు. కచ్చితంగా రేపటి రివ్యూకు ప్రభాకర్ రావును రప్పించాలని అధికారులను ఆదేశించారు. గత పదేళ్ల కింద చేసిన ప్రతి ఖర్చు మీద శ్వేత పత్రం రూపొందించే పని మీద దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. ఆరు గ్యారంటీల్లో మొదటి రెండు గ్యారంటీలను ఈ నెల 9 నుంచి అమలు చేయడానికి కేబినెట్ ఆమోదించింది.

## డిసెంబర్ 9 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

- ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షలు
- రెండు గ్యారెంటీలపై కేబినెట్ లో చర్చ
- వెల్లడించిన మంత్రి శ్రీధర్ బాబు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా డిసెంబరు 9 నుంచి రెండు గ్యారంటీలను అమలు చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ తొలి భేటీ ముగిసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10లక్షల వరకు పెంపు హామీలను సోనియా పుట్టిన రోజు సందర్భంగా అమల్లోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ రెండు గ్యారంటీలపై ఆయా శాఖల అధికారులతో శుక్రవారం సీఎం చర్చిస్తారని వెల్లడించారు. ''2014 నుంచి 2023 డిసెంబరు 7 వరకు ఏ శాఖలో ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు.. దేనికి ఖర్చు చేశారు. వాటి ప్రయోజనాలు ప్రజలకు ఎంత వరకు చేరవయ్యాయనే అనేదానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని భావిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తెలంగాణ ప్రజలకు తెలియజేసే విధంగా అన్ని వివరాలతో కూడిన అన్ని అంశాలు తెలియజేయాలని అధికారులను కోరాం. ఆరు గ్యారంటీలకు సంబంధించి మంత్రివర్గ భేటీలో సుదీర్ఘంగా చర్చించాం. ప్రతి గ్యారంటీ విషయంలో సుదీర్ఘంగా చర్చ జరుగుతుంది. అందులో భాగంగా తొలుత రెండు గ్యారంటీలను అమలు చేయాలని నిర్ణయించాం. శుక్రవారం ఆయా శాఖల అధికారులతో చర్చించి 9వ తేదీన వాటిని అమలు చేసే కార్యక్రమం చేపడతాం. దీనికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా సాగుకు 24 గంటల కరెంటు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తారు. గత తొమ్మిదేళ్లుగా విద్యుత్‌కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా వ్యవహరించలేదు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై సమీక్షించాం. 9న కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, ప్రొటెం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ప్రొటెం స్పీకర్‌ను గవర్నర్ నియమించిన తర్వాత ... వారి చేతుల మీదుగా ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం ఉంటుంది. ఆ తర్వాత స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం ఉంటుంది. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను ఆయా జిల్లాలకు సంబంధించిన మంత్రులు పరిశీలిస్తారు. మంత్రులకు శాఖల కేటాయింపుపై సీఎం, పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది'' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## పూర్తి సహకారం అందిస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ విషెస్
- రాజకీయ, సినీ ప్రముఖుల శుభాకాంక్షల వెల్లువ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

'తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా శ్రేయస్సుకు కావాల్సిన పూర్తి తోడ్పాటు అందిస్తాం' **ప్రధాని మోదీ**

'తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి అభినందనలు. ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు శుభాకాంక్షలు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' **ఏపీ సీఎం జగన్**

''తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరుకుంటున్నా. మీ పరిపాలన ప్రజారంజకంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజా సేవ చేసే దిశగా మీ భవిష్యత్తు విజయవంతం కావాలి' **తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు**

'తెలంగాణ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. అన్ని పక్షాలను కలుపుకొని వెళుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి. ప్రజా శ్రేయస్సు, అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నా' మాజీ ఉపరాష్ట్రపతి **ఎం.వెంకయ్యనాయుడు**

'సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన భట్టి విక్రమార్క, మంత్రులుగా ప్రమాణం చేసిన వారందరికీ అభినందనలు. హామీల అమలు దిశగా ప్రభుత్వం పనిచేయాలని ఆకాంక్షిస్తున్నా' **హరీశ్‌రావు**

'తెలంగాణ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆయన మంత్రి వర్గ సహచరులకు శుభాభినందనలు. వాగ్దాటి, ప్రజాకర్షణ కలిగిన నేత రేవంత్‌రెడ్డి. రాజకీయంగా ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొని సీఎం స్థాయికి ఎదిగారు. తెలంగాణలో జరిగిన ఉద్యమాలపై సంపూర్ణ అవగాహన ఉన్న నాయకుడు. రాష్ట్ర సాధన కోసం అమరులైన యువత.. ఏ ఆశయాల కోసం ఆత్మబలిదానాలు చేసిందో వాటిని సంపూర్ణంగా నెరవేర్చి ఆ త్యాగాలకు గౌరవాన్ని, సార్థకతను కల్పించాలి' **జనసేన అధినేత పవన్ కల్యాణ్**

'తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. తన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షిస్తున్నా' **తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్**

'సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌డ్డికి అభినందనలు. తెలంగాణ మంత్రులకు శుభాభినందనలు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం సంతోషంగా ఉంది. తెలంగాణ అభివృద్ధిని విజయవంతంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నా' **నందమూరి రామకృష్ణ**

'తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. మీ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సాధించాలి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు'

**సినీ నటుడు చిరంజీవి**

## మంత్రుల శాఖలు ఫైనల్ కాలేదు..

- పోర్ట్ ఫోలియోలన్ని అవాస్తవాలే..
- ప్రభుత్వం ప్రకటించేవరకు ప్రసారం చేయొద్దు
- గాంధీ భవన్ వర్గాల సూచన

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంతో పాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖలు కేటాయించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎవరికి ఏ శాఖ కేటాయించారన్న వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. అయితే మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి శాఖలు కేటాయించలేదని తెలుస్తోంది. డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క తప్ప.. ఇతర మంత్రుల శాఖలు ప్రచారంలో ఉన్న పోర్‌ట్‌ఫోలియోలన్నీ అవాస్తవాలేనని కాంగ్రెస్‌పార్టీ గాంధీభవన్‌వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన తర్వాతే శాఖల కేటాయింపుపై స్పష్టత వస్తుందని, ప్రభుత్వం ఆదేశాలు ప్రకటించే వరకు శాఖల కేటాయింపులపై ప్రసారాలు చేయవద్దని కోరాయి.




## త్వరలోనే 'ఇండియా' కూటమి భేటీ..

- డిసెంబర్17న సమావేశం కానున్నట్లు సమాచారం?
- 3 రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై చర్చే ప్రధాన ఎజెండా

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు త్వరలోనే భేటీ కానున్నారు. ఈ కీలక భేటీ డిసెంబర్ 17, 20 తేదీల్లో ఉండే అవకాశం ఉన్నట్లు కనబడుతోంది. కూటమిలోని పార్టీల ముఖ్య నేతలు పాల్గొనే ఈ భేటీలో సీట్ల పంపకాలు అంశాన్ని ప్రధాన అజెండాగా చర్చించనున్నట్లు సమాచారం. దేశ రాజధాని దిల్లీలో బుధవారం జరగాల్సిన విపక్ష 'ఇండియా' కూటమి నేతల భేటీ వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే, 'ఇండియా' కూటమి తదుపరి భేటీకి కచ్చితమైన తేదీలు ఇంకా ఖరారు కానప్పటికీ డిసెంబర్ మూడో వారంలో మాత్రం జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. డిసెంబర్ 17న సమావేశం కానున్నట్లు ఇటీవల ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కూడా చెప్పడం గమనార్హం.లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ సీట్ల పంపకాలు అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని పలు పార్టీల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. అలాగైతే.. అభ్యర్థులకు ప్రచారానికి తగినంత సమయం దొరుకుతుందని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయవచ్చని పేర్కొంటున్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఇటీవల నిర్వహించిన సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ నేతలు సీట్ల పంపకాల అంశాన్ని లేవనెత్తారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతో ప్రతిపక్షాలన్నీ ఏకమై ఇండియా కూటమిగా ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ కూటమి చివరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ముంబయిలో జరిగింది. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సెప్టెంబర్ 13న దిల్లీలో భేటీ అయింది. సీట్ల పంపకాలపై త్వరగా తేల్చాలంటూ వస్తోన్న ఒత్తిళ్ల నేపథ్యంలో తాజాగా జరగబోయే భేటీలో ఆ అంశంపైనే ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

## ఓయు లో లక్ష మంది నిరుద్యోగులతో రేవంత్ రెడ్డికి సన్మానం చేస్తాం..

**టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్**




**హైదరాబాద్ విశాలభారతి:** నిరుద్యోగుల ఆశాజ్యోతి తెలంగాణ ఉద్యమ ప్రేరణ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఓయు లో లక్ష మంది నిరుద్యోగులతో బారీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి ఉద్యమ స్ఫూర్తి తో నిరుద్యోగ యువత గ్రామాలకు వెళ్లిందని తెలంగాణ రాష్ట భవిషత్తు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి నాయకత్యం తోనే సాధ్యంమని వివరించినట్లు చెప్పారు యూనివర్సిటీస్ అభివృద్ధి నిరుద్యోగ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్యం ఆలోచన చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజల పక్షాన పోరాటం చేసిన బిడ్డకు ఓయు లో సన్మానం చేయవలసిన భద్యత నిరుద్యోగ యువత పై ఉందన్నారు.రేవంత్ రెడ్డి పోరాట స్ఫూర్తి. తో తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీ కి పట్టం కట్టారని తెలిపారు. రాష్ట ముఖ్యమంత్రి సన్మాన కార్యక్రమనికి ఉద్యమ కారులు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థి, నాయకులు, అందరి సమక్షంలో తెలంగాణ రాష్ట స్ఫూర్తి ప్రదాత రేవంత్ రెడ్డ్ కి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## టీటీడీ నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోవాలి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** టీటీడీ నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. టీటీడీ అక్రమాలపై గురువారం రాజ్యసభలో లక్ష్మణ్ లేవనెత్తారు. ఎన్నికల్లో లబ్ధి కోసం టీటీడీ నిధులను తిరుపతి కార్పొరేషన్‌కు విడుదల చేస్తోందని చెప్పారు. తిరుమలలో చోళ, పల్లవుల పాలనలో నిర్మించిన పురాతన కట్టడాలు, దేవాలయాలు, మండపాలను కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బి శివధర్ రెడ్డి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే అధికారుల ప్రక్షాలనకు నడుం బిగించారు. అత్యంత కీలకమైన ఇంటిలిజెన్స్ చీఫ్‌గా శివధర్ రెడ్డిని నియమిస్తూ సీఎంవో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అటు ప్రిన్సిపల్ సెక్రటరీగా శేషాద్రిని నియమించారు. ప్రస్తుతం పర్సనల్ అండ్ రైల్వేస్ అదనపు డీజీగా పనిచేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ అనంతరం తొలి ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో సమర్థవంతంగా ఎక్స్‌క్యూట్ కావడంలో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత శివధర్ రెడ్డి కేసీఆర్ మధ్య అగాథం పెరిగింది. దీంతో ఆయన్ని ఇంటిలిజెన్స్ పదవి నుంచి తప్పించి లూప్ లైన్ పోస్టింగ్ ఇచ్చారు. గత ఐదారేండ్లుగా లూప్‌లోనే పనిచేస్తూనే ఉన్నారు. తాజాగా రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరు క్షణమే.. ఇంటలిజెన్స్ చీఫ్‌గా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు శేషాద్రి కూడా కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగారు. గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలోనే మరికొంత మంది అధికారులను రేవంత్ మార్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.





## ప్రగతి భవన్ వద్ద కంచె తొలగింపు

- సీఎం ప్రమాణస్వీకారం జరుగుతుండగానే తొలగింపు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నేడు కొలువుదీరనుండగా ప్రగతి భవన్ వద్ద ఆంక్షలను కొత్త గవర్నమెంట్ ఎత్తి వేసింది. పదేళ్లుగా ఉన్న కంచెలను తొలగించాలని ఇప్పటికే పోలీసులకు ఆదేశాలు అందాయి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రగతిభవన్ వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేసి ఆంక్షలు విధించగా.. ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. కాంగ్రెస్ పాలనలో ప్రగతి భవన్‌కు రావొచ్చని.. తమ కంప్లైంట్‌స్‌ను ప్రజలు స్వేచ్ఛగా సీఎంకు చెప్పొచ్చని రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వడంతో కంచె తొలగింపు పనులు స్టార్ట్ అయ్యాయి. ఓ వైపు పనులు కొనసాగుతుండగానే ప్రగతి భవన్ ముందున్న బ్యారికేడ్స్ లోపలి నుంచి ట్రాఫిక్‌కు పోలీసులు అనుమతి ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ఈ మేరకు చర్యలు చేపట్టగా జేసీబీలు, కార్మికులతో బ్యారికేడ్లను యుద్ధప్రాతిపాదికన తొలగిస్తున్నారు.


అలుపెరుగని యోధులు... నిరంతర శ్రామికుడు...
తెలంగాణ రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీని
అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా
ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి
మరియు మంత్రి పదవిని సైతం త్యాగం చేసి
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేసిన
మహోన్నత వ్యక్తి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులుగా
ప్రమాణ స్వీకారం చేసిన
శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
BhuvanTeza
INFRAPROJECTS PVT LTD
Ch. Venkata Subrahmanyam
CMD, Bhuvanteza Infra



## తెలంగాణ కాంగ్రెస్ తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వాజేడు, విశాల భారతి:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం రేవంత్ రెడ్డి చేయగానే వాజేడు మండలం కేంద్రంలో ఆయన అభిమానులు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు రాష్ట్రంలో దొరల పాలన పోయిందని ప్రజల ప్రభుత్వం వచ్చిందని ప్రజల ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకం అమల వుతుందని ఆనందాన్ని వ్యక్తం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వాసు బాబు విక్రాంత్ జగన్నాథరాజు సర్పంచ్ తలడి ఆదినారాయణ ఖాజావలి షబ్బీర్ పాషా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



## కన్నులపండువగా పడిపూజ కార్యక్రమం

**పెద్దసంఖ్యలో హాజరైన అయ్యప్ప స్వాములు, భక్తులు**

**సూర్యాపేట, విశాలభారతి:** అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై వుండాలని అయ్యప్ప స్వామి ఆలయం చైర్మన్ బెలిదె శ్రీనివాసులు అన్నారు. ఉత్తర నక్షత్ర సందర్భంగా సూర్యాపేటలోని అయ్యప్ప స్వామి ఆలయం నందు బుధవారం సాయంత్రం పడిపూజ కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. దాదాపుగా ఐదు గంటల పాటు అయ్యప్ప స్వాముల శరణ ఘోషల మధ్య పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బెలిదె శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయం నందు దాతల సహకారంతో కార్తీక మాసం మొదటి రోజు నుండి 800 మంది అయ్యప్ప స్వాములకు ప్రతిరోజూ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శబరి నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం నందు ఈ సంవత్సరం 3500 మంది స్వాములు మాలధారణ చేశారని చెప్పారు. బుధవారం రోజు ఉదయం స్వామి వారి మూలవిరాట్ కు పంచామృత అష్టద్రవ్య అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు సుమారుగా 800 మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

## "పొన్నం"కుమంత్రిపదవి.."గౌడ"న్నలహర్షం




**నెల్లికుదురు, విశాల భారతి:** నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ గౌడ్ కు మంత్రి పదవి కేటాయించడం, గురువారం ఆయన ప్రమాణ స్వీకారం చేయడం పట్ల ఉమ్మడి నెల్లికుదురు మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన గౌడ సంఘం మండల నాయకులు బైరు వేణు గౌడ్, పెదగోని రాజు గౌడ్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఇక్కడ సంయుక్తంగా మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉంటూ వెనుకబడిన సామాజిక వర్గాల అభివృద్ధి, హక్కుల కోసం కృషి చేస్తున్న ప్రభాకర్ గౌడ్ మంత్రి పదవి పొందడం అభినందనీయం అన్నారు. పొన్నం బడుగు బలహీన వర్గాల ఉన్నతికి పాటుపడాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారితోపాటు గీత కార్మికులు బైరు యాదగిరి గౌడ్, పెదగోని వెంకటయ్య గౌడ్, సుధాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని సన్మానించిన సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల పాలకుర్తి నియోజకవర్గం నుండి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలను హైదరాబాద్ లోని వారి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్, దేవరుప్పుల మండల యూత్ అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి పాల్గొన్నారు.



## వంగాల చిరంజీవి మృతదేహాన్ని సందర్శించిన ఎర్రబెల్లి

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు వంగాల చిరంజీవి నిన్న బైక్ యాక్సిడెంట్ లో మరణించారు. మృతదేహాన్ని చూసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కంటతడి పెట్టుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రామిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశం, మండల నాయకులు కొల్లూరి సోమన్న, చింత రవి, ఏల సుందర్, సుడిగేల హనుమంత్, కోతి ప్రవీణ్, జోగు సోమ నర్సయ్య, గడ్డం రాజు, మేడ వెంకటేష్, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీతక్కకు సీఎం పదవి ఇవ్వకపోవడం చారిత్రక తప్పిదం

**మహాజన సమితి ఆదివాసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి**



**భద్రాచలం, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రి ప్రకటించే విషయంలో చారిత్రక తప్పిదం చేశారని మహాజన సమితి ఆదివాసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసి తెగలకు సంబంధించిన ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సీతక్కను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే తెలంగాణ యావత్తు గర్వించేదని అన్ని రంగాల్లో వెనుకబడి ఆర్థిక సామాజిక సాంస్కృతిక దోపిడికి గురై ఆదివాసీలు అస్తిత్వం కోసం అనేక పోరాటాలు చేస్తా ఉన్నారని ప్రజలు మెచ్చిన మనిషి ఆదివాసీ నేత సీతక్క సీఎం పదవికి అర్హత కలిగి ఉన్నా కూడా సీఎం పదవి ఇవ్వకపోవడం ఆదివాసీల పట్ల ఇంకా చిన్న సూపు ఉందని తేట తెల్లం అయిందని ఆమె ఆరోపించారు నిక్కర్సైన నాయకురాలుగా ప్రజా సేవకురాలుగా ప్రజల ఆదరభిమానాలు చురుకొన్న గొప్ప వ్యక్తిగా తెలంగాణ ప్రాంతం కొనియాడే మహానేత సీతక్కని ఆదివాసులకి సీఎం పదవి ఇస్తే కాంగ్రెస్సి చరిత్ర చెప్పుకుంటుందని కానీ దానికి భిన్నంగా వ్యవహరించడం సరైన విధానం కాదని ఆమె అన్నారు కింది స్థాయి కులాలను ఇంకా అనగదొక్కే ధోరణి ఉండటం బాధాకరమని ఆమె అన్నారు సీఎం పదవికి రెడ్లు కమ్మ కాపు ఎలమ వంటి ఆధిపత్య కులాలను ఎంచుకోవడం పట్ల కింది స్థాయి కులాలను అవమాన పరుస్తున్నారని కింది స్థాయి కులాలను శాఖల కే పరిమితం చేస్తున్నారని సీఎం పదవిని మాత్రం అగ్రవర్ణాలకే కట్టబెట్టడం సమంజసం కాదని ఆమె అన్నారు ఆ దొరబోతే. ఈ దొర దొరల పెత్తనం తప్ప. అనగారిన కులాల ను అవకాశం ఉన్న సీఎం పదవి ఇవ్వకపోవడం చారిత్రక తప్పిదమని ఆమె దుయ్యబట్టారు ఆ కొన్ని కులాల వారే సీఎం పదవికి అర్హత కలిగిన వాళ్ళ అని ఆమె ప్రశ్నించారు. సీఎం పదవిని సీతక్కకి ఇచ్చి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవంగా ఉండేదని. తెలంగాణ ప్రాంతం ఆదివాసుల మహిళకు సీఎం పదవి ఇచ్చిన ఘనత కాంగ్రెస్కు ఉండేదని కానీ అలా జరగక పోవటం బాధాకరమని ఆమె అన్నారు సీతక్క పేరు చదవగానే ప్రజానికం హోరెత్తిందని ఒక నిమిషం పాటు జనం అరుపులతో దద్దరిల్లిందని గవర్నర్ కాంగ్రెస్ అధిష్టానం వేదిక మీద ఉన్న నేతలంతా ఆశ్చర్యపోయేలా ప్రజా ఆదరణ సీతక్కకు దక్కిందని ఇప్పటికైనా పునర్ ఆలోచన చేసి సీఎం పదవిని సీతక్కకు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.



## మిగ్‌జాం తుపాను బీభత్సం

- నేల వాలిన వందలాది ఎకరాల వరి పంట
- కన్నీరు పెడుతున్న రైతన్నలు

**తొర్రూరు, విశాల భారతి:** మిగ్‌జాం తుఫాను ప్రభావంతో తొర్రూరు మండలంలో వందలాది ఎకరాల వరి పంట, పత్తి, మిరప, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. అలాగే ధాన్యపు రాసులు తడిసి ముద్దయ్యాయి. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వానకాలం వరి కోతలు సగమే పూర్తయ్యాయి. ఇంకా ఆయా గ్రామాల్లో కోతలు కొనసాగుతున్నాయి. వరి కోత, నూర్పిడి దశలో ఉంది. పలు ప్రాంతాల్లో ధాన్యం కల్లాల్లో ఆరబెడుతున్నారు. కోత దశలో ఉన్న వరి ఈదురుగాలులు, తుపాను కారణంగా కంకి బరువుకు నేలవాలుతోంది. గాలులకు ఆరిపోయి ఉన్న కంకుల నుంచి గింజలు నేలరాలిపోతున్నాయి. ఇక నేలవాలిన కంకులు తేమ కారణంగా మొలకొచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇక నేలవాలిన వరిని యంత్రాలు కోయటం అంతగా సాధ్యం కాదు. కూలీలతో వరికోతలు జరిపించాల్సి ఉంటుంది. దీంతో రైతులకు ఖర్చులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఓ వైపు పంట నేలవాలి కొంత దెబ్బతినగా, మరో వైపు కూలీల ఖర్చులు పెరిగి పెట్టుబడులు మరింతగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కల్లాల్లో ఆరబెట్టిన రైతులు రాశులుగా చేసి టార్పాలిన్లను కప్పి రక్షించుకునే పనిలో ఉన్నారు. తేమతో ఉన్న ధాన్యం రాశులు నాణ్యత కోల్పోతాయని రైతులు దిగులు చెందుతున్నారు. రెండు రోజులు తుపాను కొనసాగితే రాశుల్లో మొలకొచ్చే ప్రమాదం కూడా ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలోని సోమవరపు కుంట తండాలో సుమారు 50 ఎకరాల చేతికొచ్చే వరి పంట తుఫాన్ ప్రభావంతో నేల పాలయింది. మండలంలోని ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిలింది. దానిపై వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.



## ప్రభుత్వ కార్యాలయాలలో బ్లీచింగ్ పనులు చేయించిన ఎంపీఓ

**పినపాక, విశాల భారతి:** గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం గ్రామపంచాయతీల బాధ్యత అని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఎంపీఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది పినపాక మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలు, ఎంపీడీవో కార్యాలయం పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ పనులను చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. అకాల వర్షాలతో గ్రామాలలో నీరు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ సెక్రటరీలు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మధు, నేత్ర వైద్యులు సంజీవరావు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మురళీనాయక్ ను కలిసిన వైస్ ఎంపీపీ

**నెల్లికుదురు, విశాల భారతి:** మానుకోట నూతన ఎమ్మెల్యే డా మురళి నాయక్, ఆయన సతీమణి మాజీ మున్సిపల్ చైర్మన్ ఉమలను మండల వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ హైదరాబాదులో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకార ఉత్సవాలలో సైతం పాల్గొన్నట్లు పేర్కొన్నారు.



## పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపిన చావా శివరామకృష్ణ

**పాలేరు, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీ మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు తెలిపిన ఆ పార్టీ పాలేరు నియోజకవర్గం నాయకులు చావా శివరామకృష్ణ, శివరామకృష్ణ మాట్లాడుతూ, పొంగులేటి మంత్రిగా కావడం పాలేరు ప్రజలు చేసుకున్న అదృష్టమని ఆయన ఎల్లప్పుడూ నియోజకవర్గంలో అందుబాటులో ఉంటారని ఆయన ప్రతిక్షణం ప్రజల మంచి క్షేమాల గురించి ఆలోచిస్తారని అలాంటి నాయకుడు మనకి దొరకటం అదృష్టమని ఈ సందర్భంగా ఆయన అన్నారు.



## మోడీ నాయకత్వంలో దేశానికి శ్రీరామ రక్ష

**బిజెపి జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రావు**

**తొర్రూరు విశాల భారతి:** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశానికి శ్రీరామరక్ష ఉంటుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు ముద్దిరాజు రామచందర్ రావు అన్నారు. గురువారం తొర్రూరు పట్టణంలోని 3,4, వార్డులకు చెందిన తూర్పాటి శివ, తూర్పాటి సునీల్, తూర్పాటి రమేష్, తూర్పాటి చిరంజీవి, తూర్పాటి సంజయ్, సిరిపాటి అనిల్, పత్తి పవన్, బోడపర్తి పాండు, తూర్పాటి విజయ్, అల్లం షారుప్, ఛార్ల విజయ్ లతో పాటుగా 100మంది యువకులు హిందుత్వ భావజాలం, ప్రదాని నరేంద్ర మోడీ సుపరిపాలన పట్ల ఆకర్షితులై బీజేపీ తొర్రూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రావు, బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగా రాంమోహన్ రెడ్డిలు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ భారత్ ను విశ్వ గురువుగా చేయాలనే సంకల్పంతో అహర్నిశలు కృషి చేస్తున్న ప్రదాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ధేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందని, పేదల కష్టాలు స్వయంగా అనుభవించిన వ్యక్తిగా తన లాంటి ఇబ్బందులు మరెవ్వరూ పడకుండా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మోడీ పేదల పక్షపాతిగా మారిపోయాడని తెలిపారు. రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ మోడీ సుపరిపాలన పట్ల ఆకర్షితులై బీజేపీ లో యువకులు చేరడం అభినందనీయమన్నారు. తెలంగాణలో ప్రతీ గ్రామంలో యువత మోడీ నాయకత్వం పై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బీజేపి పోరాటంతోనే తెలంగాణలో కేసిఆర్ కుటుంబ పాలన, నియంత పాలన అంతం అయిందని, పాలకుర్తి ప్రజలకు విముక్తి లభించిందని తెలిపారు. భాద్యత కలిగిన ప్రతిపక్షం గా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం ప్రతీ ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, గంధం రాజు, నర్కుటి ఛలపతి రాజ్, కాగు నవీన్, నూకల నవీన్, శ్రీనాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## భళా..!రవీంద్రనాథ్ వాణిజ్య విభాగంలో ఓయూ నుంచి డాక్టరేట్



**నెల్లికుదురు విశాలభారతి:** మారుమూల గ్రామంలో జన్మించాడు. ఉన్నత చదువులను అవసానపట్టడానికి హైదరాబాద్ వెళ్లాడు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వాణిజ్య విభాగంలో డాక్టరేట్ పట్టాపొందాడు. రామన్నగూడెం ఆణిముత్యం చందపాక రవీంద్రనాథ్. వివరాల్లోకి వెళితే మానుకోటజిల్లా నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన చందపాక రవీంద్రనాథ్ వాణిజ్య విభాగంలో ప్రొ. ఎస్ కవి తాదేవి పర్యవేక్షణలో ఆర్థిక అక్షరాస్యత పై ఒక అధ్యయనం మహబూబ్ నగర్ జిల్లాలోని గ్రామీణ గృహాలుపట్టణ గృహాల మధ్య తులనాత్మక అధ్యాయనం అనే అంశం పై రవీంద్రనాథ్ పరిశోధన చేసినందుకు ఆయనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ అవార్డు ప్రధానం చేసింది. పరిశోధన అంశం అద్భుతమైన దని భావించిన డిపార్ట్మెంటల్ ప్రొఫెసర్లు రవీంద్రనాథ్ ను అభినందించారు. పరిశోధన చేస్తున్న సమయంలో పర్యవేక్షకులుగా వ్యవహరించిన ప్రొఫెసర్ కవితా దేవి సూచనలు, సలహాలు తమ పరిశోధనలో ఎంతో కీలకమైనవని, డాక్టర్ రేట్ పొందడానికి దోహదపడ్డాయని రవీంద్రనాథ్ తెలిపారు. సంబంధిత అవార్డు రావడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ కుమారునికి డాక్టరేట్ రావడం గర్వంగా ఉందని ఆయన తల్లిదండ్రులుచందపాకవెంకన్న, నాగలక్ష్మిలు సంతోషం వ్యక్తం చేశారు. రామన్నగూడెం గ్రామస్తులు సైతం రవీంద్రనాథ్ ప్రతిభ పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.



## మంచి మార్గాలను చూపేదే క్రైస్తవత్వం

**భోగి శాంతారావు, పాస్టర్ వేముల హనోక్**

**శాలిగౌరారం, విశాలభారతి:** సమాజంలోని మంచి చెడులను గుర్తుంచి సత్మార్గంలో నడిపించెదే క్రైస్తవత్వమని రెవరెండ్, ప్రముఖ ఇంజనీర్ భోగి శాంతరావు, వేముల హనోక్ ఉద్బోదించారు. గురువారం రాత్రి శాలిగౌరారంలోని ఒక ఫంక్షన్ హాల్లో కీర్తిశేషులు గోదల సత్తిరెడ్డి స్మార్ధకార్థం వారి కుమారులు, వెంకటరెడ్డి, శేఖర్ రెడ్డి లు మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మండలం లోని అన్ని గ్రామాల క్రైస్తవవులు పాల్గొన్నారు. ముఖ్య అతిధి గా పాల్గొన్న రెవరెండ్ భోగి శాంతరావు మాట్లాడుతూ పాపులను రక్షించుట కొరకై యేసు ఈ లోకం లో జన్మించాడని, అయన బోధనలు సమాజానికి మేల్కొలనలా ఉంటాయన్నారు. ఒకరినొకరు ద్వేషం కోపం వదిలి ప్రేమానురాగలతో కలిసి మెలసి ఉన్నపుడే సుఖ సౌకర్యాలతో సమాజంలో గొప్ప మార్పు కలిగి జీవిస్తారన్నారు. క్రిష్మస్ సంబరాలు అందరి కుటుంబాలలో సంతోషాన్ని నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బోడ ఇజ్రాయిల్, తాందారి సీమోన్, శ్యాంసన్ వివిధ ప్రాంతాల ఫాదర్ లు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
6
శుక్రవారం, 08.12.2023 హైదరాబాద్



## సోమవారం ప్రజావాణి నిర్వహణ

**జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్.**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో ఎన్నికల సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికలు ముగిసే వరకు రద్దు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో సాధారణ ఎన్నికలు ముగిసిన అనంతరం తేదీ.11.12.2023 న సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించగలరని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రగతి భవన్ ఇక ప్రజా భవన్

- తెలంగాణలో ప్రజా ప్రభుత్వం కొలువు తీరింది
- ఇక రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యమే

**షాద్ నగర్ విశాలభారతి:** ప్రగతి భవన్ దగ్గర ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రగతి భవన్ ను ఇక నుంచి ప్రజాభవన్ గా మార్చామని, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధితో తెలంగాణ ఉజ్వలంగా వెలుగుతుందని, పేదల మొఖాలలో వెలుగులు వెల్లివిరుస్తాయని, హక్కుల రెక్కలు విచ్చుకుంటాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు నియోజకవర్గానికి సంబంధించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, జెడ్పిటిసిలు, ఎంపీపీలు ఇతర నాయకులు శ్రేణులు పెద్ద ఎత్తున సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాంబర్ లో వీర్లపల్లి శంకర్ సీఎంను కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అభినందనలు తెలియజేశారు. తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని సీఎం అన్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువు తీరిందని, ఇంతకాలం ఉన్న బానిసత్వపు సంకెళ్లు బద్దలు అయ్యాయని తెలియజేశారు.





## రైతులను గోల్ మాల్ చేస్తున్న కొనుగోలు కేంద్రం

**మోతె, విశాల భారతి:** మోతె మండల పరిధిలోని గోల్ తండా గ్రామంలో నిర్వహిస్తున్న పి పి సి కొనుగోలు కేంద్రం లో రైతులను గోల్ మాల్ చేస్తున్నట్లు గురువారం వరి ధాన్యం అమ్మకాలు చేస్తున్న రైతులు తెలిపారు. ప్రభుత్వం తెలిపిన తుకాలు వేయకుండా నిర్వాహకులు తమ ఇస్టాను సారంగా తుకాలు వేసి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దళారీల పాలు అవుతుందని వాపోతు చెప్పారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులను మీ ధాన్యం ఇంకా మైచర్ రాలేదని దబాయిస్తున్నరని నిర్వహకులు చెప్పిన విధంగా వినాలని లేదంటే మా వద్ద కు ధాన్యం తీసుక రావద్దని మొకం మీదనే చెపుతున్నారని ఘర్షణ కు దిగారు. రైతు గుగులోతు నాగు నాయక్ వివరణ బస్తా తరుగు పేరుతో ఐదు వందల గ్రాములు తరుగు పేరుతో ఐదు వందల గ్రాములు ధాన్యం తడిసింది మ్యాచర్ రాలేదంటు మరో అర కిలో సుమారుగా ఒక బస్తాకు కిజి న్నర అదనంగా తుకావెస్తున్నరని అడిగితే నిన్నెవరు సెంటర్ కు ధాన్యం తెమ్మన్నరని అంటు నీ సంగతి చూస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి గెలుపుపై హర్షం



**నల్లగొండ, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించిన పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం పట్ల సీనియర్ అడ్వకేట్, తెలంగాణ రాష్ట్ర పూసల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుండ్లపల్లి సత్యనారయణ వర్షం వ్యక్తం చేశారు. కార్యకర్త స్థాయి నుండి అంచెలంచలుగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం అభినందనీయమని ప్రమాణ స్వీకారం చేసిన రోజే ప్రగతి భవన్ పేరును జ్యోతిరావు పూలే ప్రజాభవన్ గా పేరు మార్చడం, మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు ఫైలుపై మొదటి సంతకం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని సంచార జాతి కులాలని ఆదుకోవాలని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సంచార జాతులని ఎంబీసీ గ్రూపులో చేర్చి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు.




## బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం

- బేటి బచావో" "బేటి పడావో" అవగాహన కార్యక్రమం
- జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ

**మహబూబాబాద్, విశాల భారతి:** మరిపెడ మండలం, వీరారం గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "జిల్లా మహిళా సాధికారత కేంద్రం" ఆధ్వర్యంలో "బేటి బచావో" "బేటి పడావో" అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ మాట్లాడుతూ... పిల్లలకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించడం అయినది. నేడు అమ్మాయిలకు రక్షణ కరువైందని వారి పట్ల లింగ వివక్షత చూపుతున్నారని అన్నారు. అలా కాకుండా అమ్మాయిలను కూడా అబ్బాయిలతో సమానంగా చూడాలని ముందుగా తల్లి దండ్రులు పిల్లల పట్ల వివక్ష చూపకూడదని తల్లి దండ్రులు సమానంగా చూసినట్లయితే సమాజంలో కూడా వీరిని గౌరవంగా చూస్తారని అన్నారు. పిల్లలు మంచి పోషకాహారం తీసుకొని భవిష్యత్తులో పిల్లలు గొప్పగా ఎదగాలని తెలియజేశారు. బాల్య వివాహాలు గురించి, పిల్లల అక్రమ రవాణా గురించి తెలియ చేయడం అయినది, మరియు హెల్ప్ లైన్ నంబర్స్ 1098,181,100,1930 గురించి చెప్పడము అయినది. ఎనిమియా పిల్లలకి పోషకాహార ఫలహారం పంపిణీ చేయడము జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల తాత్కాలిక ప్రధాన, ఉపాధ్యాయుడు వెంకన్న, ఇతర ఉపాధ్యాయునులు, అంగన్వాడీ టీచర్ కవిత విద్యార్థులు, మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ సంధ్యారాణి, రాకేష్ లు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులకు గరం కోట్లు అందించాలి

**సీఐటీయు నాయకులు**

**మందమర్రి టౌన్, విశాల భారతి:** సింగరేణి యాజమాన్యానికి వాహన రక్షణ కవచంపై ఉన్న శ్రద్ధ, చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో సింగరేణి కార్మికులకు చలి కాలంలో అందించే గరం కోట్లు ఎందుకు ఇవ్వడం లేదని సీఐటియు నాయకులు అల్లి రాజేందర్ ప్రశ్నించారు. గురువారం కాసిపేట గనిపై కార్మికులను ట్రామర్, హలర్ డ్రైవర్ కార్మికులను కలిసి మాట్లాడుతూ వ్యక్తిగత రక్షణ బాధ్యత అంటూ హెల్మెట్ పెట్టుకొని డ్యూటీకీ రావాలని నిబంధన విధించి, రక్షణ కవచం లేని పక్షంలో ఫోటోలు తీసి, హెచ్చరిక ఉత్తరం ఇవ్వడం వంటివి చేసే యాజమాన్యం తన బాధ్యతగా కార్మికులకు చలికాలంలో ఇచ్చే గరం కోట్లపై ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. యాజమాన్యానికి అనుకూలంగా ఉండి రక్షణ, మైన్స్ కమిటీలలో ప్రశ్నించని టీబీజీకేఎస్, ఏఐటియుసి వంటి సంఘాలు ఉండడం వల్లనే నేడు యాజమాన్యం కార్మికులకు ఇచ్చే గరం కోట్లు, బూట్లు సమయానికి ఇవ్వడం లేదని అన్నారు. కార్మికుల సమస్యలపై నిజాయితీగా పోరాడే సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ దెబ్బటి తిరుపతి, ఆర్గనైజర్ చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బోయినిపల్లి మార్కెట్ పై మైనంపల్లి మార్క్

**సికింద్రాబాద్ కంటోన్మెంట్, విశాల భారతి:** బి.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ చైర్ పర్సన్ గా ఫిబ్రవరి 6వ తేదీన 2023 బాధితులు చేపట్టిన రాగిరి హారిక, అప్పటినుండి మైనంపల్లి సోదరిగా తన ముద్రను చాటుకునేందుకు అహర్నిశలు కష్టపడి మార్కెట్లో చోటు చేసుకున్న సంఘటనలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు ఆకస్మికంగా తన సోదరి రాగిరి హారిక బాధ్యతలు చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా, ఏనాడూ తనను కలవలేదు, పలు కారణాలతో రాలేకపోవడం సమయం దొరకకపోవడంతో, నిన్న చైర్ పర్సన్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపి, చైర్ పర్సన్ కార్యాలయంలో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ వెజిటేబుల్ కమిషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ మైనంపల్లిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి మార్కెట్లో "గ్రేడ్ టు మొదలుకొని సిబ్బంది" వరకు అవినీతికి పాల్పడుతున్నారని, "ఏళ్ల తరబడి బదిలీలు లేకుండా ఇక్కడే మకాం వేసి" వారి కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మిగతా సభ్యుల పై చర్యలు తీసుకోవాలని కమిటీని రద్దు చేయాలని, ఏళ్ల తరబడి బోయిన్ పల్లి మార్కెట్లో పని చేస్తున్న అధికారులను బదిలీ చేయాలని మైనంపల్లి దృష్టికి తలసాని శంకర్ యాదవ్ తీసుకెళ్లారు.



## ఎమ్మెల్యే కోరం కనకయ్యను శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు

**మహబూబాబాద్, విశాల భారతి:** హైదరాబాదులోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు .కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా నాయకులు బానోతు రాము నాయక్, కాంగ్రెస్ పార్టీ బయ్యారం యువ నాయకులు భూక్య రవి నాయక్, బానోతు సుధాకర్ నాయక్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక

**సైదాపూర్, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 4న జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ అండర్ 19 బాలుర విభాగంలో అథ్లెటిక్ హైమర్ త్రో ఈవెంట్ పోటీల్లో సైదాపూర్ మండలం సోమారం మోడల్ స్కూల్ విద్యార్థి సుంకే వంశీ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. విద్యార్థి సుంకే వంశీని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా, వైస్ ప్రిన్సిపాల్ మోయిస్ ,ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణు వర్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## బోయిన్ పల్లి మార్కెట్ లో దీపావళి పేరుతో బంపర్ ఆఫర్

**పది లక్షలు కొల్లగొట్టిందెవరు?**



**హైదరాబాద్, విశాల భారతి:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నేతలతో పాటు అధికారులు కూడా దోపిడీకి తెగబడ్డారు. మార్కెట్లో ఆలస్యంగా వెలుగు చూసిన బోయినపల్లి మార్కెట్లో దీపావళి పేరుతో గ్రేడ్ 2,3 సూపర్వైజర్లు సిబ్బంది దీపావళి పేరుతో వసూళ్ల పర్వానికి తెర లేపారు. సేటు నమస్తే దీపావళి భక్షిత్ అంటూ ఒక్కో దుకాణానికి పదివేల రూపాయల చొప్పున వసూలు చేశారు. సుమారు 300 పైచిలుకు దుకాణాలు, కమీషన్ ఏజెంట్ల నుండి వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం. ఎండిబీఏ 8, కేఎస్ఆర్ బి 16/1, టీవీ బీ 46 మొత్తం మార్కెట్లో ఈ మూడు దుకాణాలు మినహాయించి అందరూ దీపావళి కానుకలు చెల్లించుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ గా పేరుగాంచిన బోయినిపల్లిలోని బి.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ సగటున ఒక రోజుకి 25 వేల టన్నుల కూరగాయలను 17 రాష్ట్రాల నుంచి వివిధ రకాల కూరగాయలను మార్కెట్ యార్డుకు దిగుమతి అవుతున్నాయి. ఫిబ్రవరి 6,2023 ఐదో చైర్ పర్సన్ గా రాగిరి హారిక బాధితులు చేపట్టడం జరిగింది. గత ఐదేళ్లల్లో రెండేళ్లు జాతీయ విపత్తుల కారణంగా( కోవిడ్ కారణంగా) అధికారులు దీపావళి కానుకలకు దూరంగా ఉండి 2021 నుండి 2023 వరకు మూడేళ్లు నిరంతరంగా దీపావళి పేరుతో ప్రతి ఏటా 10 నుంచి 15 లక్షలు పై చిలుకు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి బోయినపల్లి మార్కెట్లో విధులు నిర్వహిస్తున్న గ్రేట్ టు నుండి మొదలుకొని సిబ్బంది వరకు చర్యలు తీసుకొని బదిలీలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే ఈ పాపములో పై అధికారులు కూడా వాటా ఉందని మార్కెట్ వర్గాలు గుసగుసలాడుతున్నారు.

**మైనంపల్లికి తలసాని శంకర్ యాదవ్ ఫిర్యాదు:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో గ్రేడ్ 2 మొదలుకొని, సిబ్బంది వరకు ఏళ్ల తరపడి పాతుకుపోయారని, సేవలు పక్కనపెట్టి వసూళ్లకు తెర లేపారని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కు తలసాని శంకర్ యాదవ్ ఫిర్యాదు చేశారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..

**మేయర్ జక్క వెంకట్ రెడ్డి**

**మేడిపల్లి, విశాల భారతి:** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో సీజనల్ వ్యాధులు, దోమల నివారణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్యా కలిసి నగర ప్రజల ఇండ్లలో దోమల మందును స్ప్రే చేస్తూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.





## నూతన బొగ్గు గనులను సాధిస్తాం

**బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ**

**మందమర్రి టౌన్, విశాల భారతి:** కార్మిక హక్కులను కాపాడుతూ, రానున్న రోజుల్లో నూతన బొగ్గు గనుల కోసం పోరాటం చేసి సాధిస్తామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ అన్నారు. గురువారం మందమర్రి ఏరియా కేకే 5 గని పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కారు సంఘాలు గెలవడం వలన కార్మికుల హక్కులను కాల రాశాయని అన్నారు. కార్మికుల ఇంక్రిమెంటులు, జీత భత్యాలు లాభాల వాటాతో పాటు అనేక ఆర్థికపర హక్కులను సాధించిన ఘనత ఏఐటీయూసీ సంఘానిదని అన్నారు. ఈ ఎన్నికలలో గెలిచిన అనంతరం కార్మికులకు స్వంత ఇంటీ కల సాకారం కాబోతుందని తెలిపారు. పెర్క్స్ పై ఇన్కంటాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా చేస్తామని, సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా, ఆర్థిక దోపిడీ జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 27వ తారికున జరిగే ఎన్నికలలో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సంఘం, నిరంతరం కార్మికుల పక్షాన పోరాడే సంఘం ఏఐటీయూసీ నక్షత్రం(చుక్క) గుర్తు కు ఓటు వేసి కార్మిక హక్కులను కాపాడు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్, బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గాండ్ల సంపత్, పిట్ కార్యదర్శి దేవసాని సాంబయ్య, పిట్ నాయకులు సట్ల కొండయ్య, గుమ్మడి సంపత్, శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం జెట్టి మల్లయ్య, దాసరి జనార్ధన్, సీరిలే నాయకుడు వెంకటస్వామి, కాసం సమ్మయ్య, కార్మికులు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

## వివాహానికి పుస్తే మెట్టెల బహుకరణ

**షాద్ నగర్, విశాల భారతి:** తమ గ్రామానికి చెందిన ఆడపడుచు పెళ్లి ఉందని తెలుసుకున్న పాపిరెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి తల్లి విజయలక్ష్మి పెద్ద మనసుతో పెళ్లి కానుకగా పెళ్లి కూతురుకు పుస్తె మెట్టెలను బహుకరించింది. షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం పాపిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన కాటికేల యాదమ్మ, వెంకయ్యల కూతురు రాజేశ్వరి వివాహం సందర్భంగా గురువారం పెళ్లి కూతురికి పుస్తె, మెట్టెలను ఆమె అందించారు. కలకాలం పిల్లాపాపలతో సంతోషకరమైన జీవనం సాగించాలని ఈ సందర్భంగా పెళ్లికూతురును ఆమె దీవించారు.



## ఖమ్మంలో యూనిటీ మహాసభ.

- పీసీసీ సీపీఐ (యం.ఎల్), సీపీఐ (యం. ఎల్) ప్రజాపంథా మరియు సీపీఐ (యం.ఎల్) రెవెన్యూషనరీ ఇన్షియేటివ్.

**హైదరాబాద్ విశాల భారతి:** పీసీసీ సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ ప్రజాపంతా, సిపిఐ ఎంఎల్ రెవెన్యూ సారి ఇన్సెయేటివ్ సంస్థల ఐక్యతా చర్చలు జనవరి 2023లో ప్రారంభమయినాయని ఐక్యతా సమావేశ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ పి రంగారావు పేర్కొన్నారు. వాటి కొనసాగింపుగా 2023 నవంబర్ 28, 29, 30 తేదీలలో కలకత్తాలో సమావేశమై మూడు సంస్థల ఐక్యతకు సంబంధించిన విధి విధానాలు పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు."భారత విప్లవోద్యమమునకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను సమగ్రంగా చర్చించి సిద్ధాంతపరమైన, రాజకీయ మరియు నిర్మాణపరమైన అంశాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ పంథా నిబంధనావళిని రూపొందించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుత నిర్దిష్టమైన పరిస్థితుల లో మూడు సంస్థలు కలిసి ఒకే పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడాలని భావించామన్నారు. భిన్న ఆలోచనలను చర్చించుకొని ఐక్యతగా, ఒకటిగా నడవాలని నిర్ణయించాయని తెలిపారు. ఈ ఐక్యత భారత విప్లవోద్యమ శక్తుల ఐక్యతకు మొదటిమెట్టు కావాలనుకోవడం జరిగిందన్నారు.అఖిల భారత ఐక్యతా మహాసభ (యూనిటి కాన్ఫరెన్స్) 2024 మార్చి 3, 4 మరియు 5వ తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో నిర్వహిస్తామన్నారు. మార్చి 3వ తేదీన భారీ ర్యాలీ నిర్వహించి, అత్యధిక మందితో అతిపెద్ద బహిరంగ సభ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ సభలో మూడు పార్టీల కేంద్ర కమిటి నాయకులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. ఈ సభా ప్రాంగణానికి మా అభిమాన నాయకులైన కామ్రేడ్ సంతోష్ రాణా మరియు రవన్న పేర్లు పెట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

## ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ వారి ఖాదీ మేళా

**మందమర్రి టౌన్, విశాల భారతి:** రాబోవు కిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సింగరేణి యాజమాన్యం అనుమతితో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ వారు ఖాదీ మేళా నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 4 నుండి 12 వ తారీకు వరకు సీఈఆర్ క్లబ్ లో నిర్వహిస్తున్న ఖాదీ మేళాలో సింగరేణి ఉద్యోగస్తులకు ఇరవై వేల వరకు కొనుగోలుపై ఉద్దేర అవకాశం కల్పిస్తున్నామని, కార్మికులు వీటిని కొనుగోలు చేసినట్లైతే 5 కిస్తులలో జీతంలో మినహాయించుకునే వెసులు బాటు కల్పించామని తెలిపారు. ఖాదీ వస్త్రాల పై 30%, ఖాదీ పోలిపై 30%, పొందూర్ ఖాదీ 20%, కోసా సిల్కు ఉలన్ వస్త్రాలపై 20% రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. వీరి వద్ద అన్ని రకాల ఖాదీ వస్త్రములు, టవల్స్, చెద్దర్లు, కలంకారి, బెడ్ షీట్లు, లుంగీలు, స్టార్ కార్పెట్స్, సమ్మర్ కూల్ మసలీన్ ఖాదీ, సీల్కు షర్టింగ్, టస్సర్, పాలిస్టర్ ఖాదీ, గ్రామోద్యోగ వస్తువులు స్వచ్ఛమైన తేనే, కుటీర్ సోప్స్, అగరవత్తులు, జీవశక్తి టానిక్, స్టేవియా పౌడర్, సుగర్ స్థాయి తగ్గుటకు మందులు లభిస్తాయిని తెలిపారు. వేలాది నిరుపేద చేతి వృత్తి కుటుంబాలకు పని కల్పించేందుకు ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయాలని సింగరేణి యాజమాన్యం కోరింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com



శుక్రవారం, 08.12.2023
హైదరాబాద్










విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్



## ఎనుముల రేవంత్‌రెడ్డి , ముఖ్యమంత్రి

నియోజకవర్గం:కోడంగల్

జననం: 08 నవంబర్ 1969



1992లో విద్యార్థిగా ఉన్న సమయంలో ఆయన ఏబీవీపీలో మెంబర్‌అయ్యారు.

2004లో తెలుగుదేశం పార్టీలో చేరారు.

2006లో జడ్పీటీసీ ఎన్నికల్లో మిడ్జిల్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నెగ్గారు.

2008లో శాసనమండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

2008లో రేవంత్ రెడ్డి టీడీపీలో మరోసారి చేరారు.

2009లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఆయన గెలుపొందారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన గురునాథ్ రెడ్డిని ఓడించారు.

2014లో కొడంగల్ నుంచి మరోమారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గురునాథ్ రెడ్డిపై గెలిచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు.

2015లో ఒక శూలశోధన ఆపరేషన్‌లో దొరికిపోవడంతో ఏసీబీ అధికారులు రేవంత్ రెడ్డిని అరెస్టు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా ఆంగ్లో-ఇండియన్ నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు డబ్బులివ్వజూపారన్నది రేవంత్ రెడ్డిపై ఉన్న ఆరోపణ. జూన్ 30న తెలంగాణ హైకోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిలును మంజూరు చేసింది. బెయిలు నిబంధనల ప్రకారం ఏసీబీ అనుమతులు లేకుండా ఆయన హైదరాబాద్ నగరాన్ని దాటరాదు.

2017 రేవంత్ రెడ్డి టీడీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

2018 తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్లలో ఒకరిగా ఆయన నియమితులయ్యారు.

2018 తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ టికెట్‌పై కొడంగల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా గెలుపొందారు.

## భట్టి విక్రమార్క , ఉప ముఖ్యమంత్రి

నియోజకవర్గం:మధిర

జననం: 1961, జూన్ 15



విద్యాభ్యాసం: హైదరాబాద్ నిజాం కాలేజ్‌లో డిగ్రీ, HCUలో పీజీ.

2009లో తొలిసారి మధిర నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నిక

2009-11 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ విప్‌గా బాధ్యతలు

2011-2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్

2009 – 2023 మధ్య 4సార్లు మధిరలో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం

గత శాసనసభలో కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ లీడర్‌గా బాధ్యతలు

## కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రి

నియోజకవర్గం:నల్గొండ

జననం: 1963 మే 23



యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ అరంగేట్రం

2009 – 2014 మధ్య నల్గొండ ఎమ్మెల్యేగా బాధ్యతలు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో చోటు

2011లో తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా

2018లో నల్గొండ అసెంబ్లీ స్థానంలో ఓటమి

2019లో భువనగిరి పార్లమెంటు సభ్యులుగా గెలుపు

2023లో మరోసారి నల్గొండ నుంచి అసెంబ్లీకి ఎన్నిక

## దామోదర్ రాజనర్సింహ , మంత్రి

యోజకవర్గం:అందోల్

జననం: 5 డిసెంబరు 1958



తల్లిదండ్రులు: దివంగత మంత్రి రాజనర్సింహ– జానాబాయి

1989లో తండ్రి మాజీ మరణంతో రాజకీయాల్లోకి ప్రవేశం..

1989లో అందోల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా తొలిసారి గెలుపు..

2004 లో అందోల్ నుంచి మరోసారి విజయం

2006లో వైఎస్ఆర్ పాలనలో ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా

2009లో వైఎస్ఆర్, రోశయ్య హయాంలో మంత్రి వర్గంలో చోటు

2011 జూన్ 10వ తేదీన డిప్యూటీ సీఎంగా నియమాకం

ఆ తర్వాత 2014, 2018 ఎన్నికల్లో ఓటమి

ఆగస్టు 20, 2023న జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత ఆహ్వానిత సభ్యుడిగా నియమాకం

2023 లో అందోల్ నుంచి అసెంబ్లీకి ఎన్నిక

## పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి

నియోజకవర్గం:పాలేరు

జననం: 28 అక్టోబర్ 1965



2014లో ఖమ్మం నుంచి వైఎస్సార్సీపీ తరపున ఎంపీగా విజయం

2014 తర్వాత బీఆర్ఎస్‌లో చేరిక

2023లో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో జాయిన్

2023లో పాలేరు నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నిక

## దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి

నియోజకవర్గం:మంథని

జననం: 9 మార్చి 1969



ధన్వాడ గ్రామం, కాటారం మండలం, జయశంకర్ జిల్లా, తెలంగాణ

తల్లిదండ్రులు దుద్దిల్ల శ్రీపాద రావు, జయమ్మ

జీవిత భాగస్వామి శైలజా రామయ్యర్ (ఐఏఎస్ అధికారిణి)

ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యను అభ్యసించారు.

1998లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్.

1999లో తండ్రి హత్యానంతరం రాజకీయాల్లో అడుగుపెట్టిన శ్రీధర్‌బాబు

1999 శాసనసభ ఎన్నికల్లో మంథని నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరపున విజయం

1999 కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు

1999 – 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం శాసనసభ్యునిగా ఎన్నిక

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు.

## కొండా సురేఖ, మంత్రి

నియోజకవర్గం:వరంగల్ తూర్పు

జననం: 1965 ఆగస్టు 19



1995లో మండల పరిషత్ మెంబర్‌గా ఎన్నిక

1999, 2004 ఎన్నికల్లో శాయంపేట ఎమ్మెల్యే ఎన్నిక

2009లో పరకాల నియోజకవర్గం నుంచి గెలుపు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో మంత్రి

2011లో కాంగ్రెస్‌కు రాజీనామా

2014లో బీఆర్ఎస్ పార్టీ తరుపున వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి గెలుపు

2018లో మరోసారి కాంగ్రెస్‌లో చేరిక

2023లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి విజయం

## ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి

నియోజకవర్గం:హుజూర్ నగర్

జననం: 1962 జూన్ 20



బీఎస్సీ గ్రాడ్యుయేట్, ఇండియన్ ఫోర్స్ మాజీ పైలట్

1999-– 2009 మధ్య కోదాడ ఎమ్మెల్యే

2014 దాకా ఉమ్మడి ఏపీ గృహనిర్మాణశాఖ మంత్రి

2015-– 2021 మధ్య తెలంగాణ పీసీసీ అధ్యక్ష బాధ్యతలు

2009-– 2018 మధ్య హుజుర్‌నగర్ ఎమ్మెల్యే

2019 సాధారణ ఎన్నికల్లో నల్గొండ ఎంపీగా గెలుపు

2023లో మరోసారి హుజుర్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక

## పొన్నం ప్రభాకర్ , మంత్రి

నియోజకవర్గం:హుస్నాబాద్

జననం: :1967 మే 8



విద్యార్థి నాయకుడిగా రాజకీయం అరంగ్రేటం

1987 – 89 వరకు ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి

1989 – 91 వరకు ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

1999- 2002 వరకు ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు

2002 – 2003 మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

2009లో కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా గెలుపు

2014లో కరీంనగర్ ఎంపీ స్థానంలో ఓటమి

2018 అసెంబ్లీఎన్నికల్లో కరీంనగర్ నుంచి ఓటమి

2023లో హుస్నాబాద్ నుంచి అసెంబ్లీకి ఎన్నిక

## ధనసరి అనసూయ ( సీతక్క ), మంత్రి

నియోజకవర్గం:ములుగు

జననం:1971 జూలై 9



1988లో 10వ తరగతిలోనే నక్సల్స్ పార్టీలో చేరిక

జన నాట్యమండలి ద్వారా ఆదివాసీల సమస్యలపై పోరాటం

రెండు దశాబ్దాల పాటు కామ్రేడ్‌గా వివిధ హోదాల్లో విధులు

ఎన్టీఆర్ పిలుపుతో జనజీవన స్రవంతిలోకి రాక

2001లో న్యాయవాదిగా ప్రాక్టీస్

2004లో ములుగు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ, తప్పని ఓటమి

2009లో తొలిసారి ములుగు నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నిక

2014లో ఓటమి, అనంతరం కాంగ్రెస్‌లో చేరిక


2018 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ములుగు నుంచి గెలుపు.

2023 ఎన్నికల్లో ములుగు నియోజకవర్గం నుంచి విజయం

## జూపల్లి కృష్ణారావు, మంత్రి

నియోజకవర్గం:కొల్లాపూర్

జననం: 1955, ఆగస్టు 10



1999 – 2014 మధ్య కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వరుస విజయాలు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా అవకాశం

2011లో కాంగ్రెస్ పార్టీ వీడి బీఆర్ఎస్‌లో చేరిక

2014లో తెలంగాణ తొలి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నుంచి ఓటమి

2022లో బీఆర్ఎస్ పార్టీ వీడి మళ్లీ కాంగ్రెస్‌లో చేరిక

2023లో కొల్లాపూర్ నుంచి మరోసారి అసెంబ్లీకి ఎన్నిక

## తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి

నియోజకవర్గం:ఖమ్మం

జననం: 15 నవంబర్ 1953



1985 నుంచి 1988 వరకు ఎన్టీఆర్ మంత్రివర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు.

1994 నుంచి 1999 వరకు ఎన్టీఆర్, చంద్రబాబుల మంత్రివర్గంలో చిన్ననీటి పారుదల , ఎక్సైజ్ శాఖ మంత్రిగా..

1999 నుంచి 2004 వరకు చంద్రబాబు మంత్రివర్గంలో భారీ నీటి పారుదల, రోడ్లు, భవనాల శాఖల మంత్రిగా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ మంత్రివర్గంలో 2015 నుంచి 2018 వరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, రోడ్డు, భవనాలు శాఖల మంత్రిగా పనిచేశారు.

2023 సెప్టెంబర్ 14న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.














Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.